శివరాత్రికి ఆలయాల ముస్తాబు



జహీరాబాద్‌టౌన్: శ్రీసిద్దేశ్వరస్వామి ఆలయం



పటాన్‌చెరు టౌన్: ఉత్సవాలకు ముస్తాబైన రామలింగేశ్వర దేవస్థానం

శివరాత్రి మహోత్సవాలకు జిల్లాలోని ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. రామలింగేశ్వర దేవస్థానం, సిద్దేశ్వరస్వామి ఆలయం, ఉమా సంగమేశ్వర ఆలయాలను నిర్వాహకులు విద్యుత్ దీపాలు, తోరణాలతో అలంకరించారు. 25న ఉదయం శిఖరపూజ, ధ్వజారోహణం, మహాగణపతి, పుణ్యవచనాలు, గోమాతపూజ, కుంకుమార్చన, కార్యక్రమాలు ఉంటాయి. 26న రుద్రాభిషేకం, పరమేశ్వరుడి విగ్రహస్థాపన, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, నీటి వసతి, విద్యుత్‌దీపాల వసతి ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.



నారాయణఖేడ్: ముస్తాబైన ఉమా సంగమేశ్వర ఆలయం

క్లుప్తంగా

నిర్లక్ష్యానికి మొక్కలు బలి



కాలిపోయిన మొక్కలు

నారాయణఖేడ్: పొలాల పక్కనున్న గడ్డిని కాల్చడంతో రహదారి వెంబడి ఉన్న మొక్కలు కాలిపోయాయి. మండలంలోని జి.హుక్రాన గ్రామ సమీపంలో రహదారికి ఇరువైపులా అటవీశాఖ , పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఇటీవల ఆయా పొలాల వారు గడ్డిని కాల్చివేయడంతో మొక్కల చుట్టూ ఉన్న గడ్డితో పాటు మొక్కలు కూడా కాలిపోయాయి. లక్షలు వెచ్చించి హరితహారంలో మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణకు సరియైన చర్యలు తీసుకోకపోవడంతో అవి చనిపోతున్నాయి.

జరిమానాలు చెల్లించని వారికి నోటీసులు



పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వాహనదారులు

జోగిపేట(అందోల్): నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జరిమానాలు చెల్లించని వారికి జోగిపేట పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోలీసులు ఫోన్ చేయడంతో వందల మంది వాహనదారులు సోమవారం స్టేషన్‌కు ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో తరలివచ్చారు. వారికి పోలీసులు నోటీసులు అందజేసి నేషనల్ లోక్ అదాలత్‌లో జరిమానాలు చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా జోగిపేట ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడుతూ.. మార్చి 8న జోగిపేట జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు. క్షణికావేశంలో జరిగిన గొడవ కేసులను రాజీ కుదుర్చుకునేందుకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజలే రోడ్డు వేసుకున్నారు..



జేసీబీతో రోడ్డు వెడల్పు చేస్తున్న గ్రామస్తులు

రామచంద్రాపురం (పటాన్ చెరు): తెల్లాపూర్ నుంచి హుడా వెళ్లే మార్గంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామస్తులు సొంత నిధులతో సోమవారం టిప్పర్లతో మట్టి పోసి రోడ్డు వెడల్పు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆ మార్గంలో సర్కిల్ ఏర్పాటుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని గతంలో అనేకమార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోవడంతో తామే రోడ్డు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుద్ధ్య సమస్య రానివ్వద్దు



డంప్‌యార్డును పరిశీలిస్తున్న డీపీఓ సాయిబాబా

సంగారెడ్డి: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అధికారులను ఆదేశించారు. సోమవారం చౌటకూరు మండలంలోని వేడికోలు గ్రామంలో ఆయన ఆకస్మికంగా పర్యటించి తడి పొడి చెత్త సేకరణపై ఆరా తీసి పారిశుద్ధ్య వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శికి సూచనలు, సలహాలు చేశారు. గ్రామాల్లో సర్పంచులు లేని లోటు కన్పించకుండా అధికారులు మసులుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

పరిహారం చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని పలుగు తండాకు చెందిన నేనావత్ శంకర్ నాయక్ ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై కాలిపోయింది. దీంతో నష్టపరిహారం కింద ప్రభుత్వం రూ. 41,100 మంజూరు చేసింది. మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి సోమవారం ఖేడ్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సంబంధిత చెక్కుతో పాటు కొంత నగదు ఆర్థిక సహాయం చేశారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రేయారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, మండల పార్టీ యువత అధ్యక్షుడు మచ్చేందర్ పాల్గొన్నారు. మండలంలోని మద్వార్ గ్రామానికి చెందిన గోవింద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని భూపాల్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించండి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సోమవారం బస్టాండ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్టాండ్, ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని పలుకాలనీల్లోని సీసీరోడ్లు, మురుగుకాల్వలను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, ఆర్టీసీ మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు ఉన్నారు.

ప్యారానగర్‌ను మరో జవహర్‌నగర్‌గా మార్చొద్దు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కారాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కారాములు

పటాన్‌చెరు టౌన్: ప్యారానగర్‌ను మరో జవహర్‌నగర్‌గా మార్చొద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు చుక్కారాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి, ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డును ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. సోమవారం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కారాములు మాట్లాడుతూ.. ప్యారానగర్‌లో జీహెచ్‌ఎంసీ పరిధిలోని చెత్త వేయడానికి రాంకీ ప్రైవేట్ సంస్థ డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు చేపట్టిందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ తీసుకోకుండానే డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు సిద్ధపడతారని ప్రశ్నించారు. విమానాలకు ఇబ్బందులు కలుగుతాయని ఈప్రాంతంలో డంపింగ్ యార్డు నిర్మాణం చేపట్టవద్దని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ కమాండర్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, లలిత,రాజయ్య పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును రద్దు చేయండి

జహీరాబాద్ టౌన్: గుమ్మడిదల మండలం ప్యారానగర్, నల్లవల్లి గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డును రద్దు చేయాలని సీపీఎం ఏరియా కార్యదర్శి రాంచందర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి సూపరింటెండెంట్ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన చెత్తను పచ్చని పల్లెల్లో డంపింగ్ చేయడం సరికాదన్నారు. 13 గ్రామాల్లో వాతావరణం, నీరు కలుషితమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి డంపింగ్ యార్డు ఏర్పాటును విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సలీమొద్దీన్, నర్సింలు, తుల్జారాం, చంద్రయ్య, రవి పాల్గొన్నారు.

పట్టభద్రులు కాంగ్రెస్ వైపే..

కాంగ్రెస్ నేత నీలం మధు



సమావేశంలో మాట్లాడుతున్న నీలం మధు

పటాన్‌చెరు: ఏడాదిలోనే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ వైపే పట్టభద్రులు ఉన్నారని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన రాష్ట్ర ఫిషరీస్ సొసైటీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ రంగంలోనే కాకుండా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంక్షారెడ్డి , ప్రధాన కార్యదర్శులు రఘురాం శివాంత్ రెడ్డి, షామిలి, పట్టభద్రులు పాల్గొన్నారు.

ప్రజలపై బీరప్ప ఆశీస్సులు ఉండాలి

పటాన్‌చెరు టౌన్: బీరప్ప, మల్లన్న స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి గ్రామంలో నిర్వహించిన బీరప్ప, మల్లన్న స్వామి జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ఉత్సవాలకు ఆహ్వానం



సీఐకి ఆహ్వానపత్రికను ఇస్తున్న బాధ్యులు

నారాయణఖేడ్: పట్టణ శివారులోని వెంకటాపూర్‌లో నూతనంగా నిర్మించిన మార్కండేయ దేవాలయ ప్రారంభోత్సవ ఉత్సవాలను వచ్చేనెల 3న నుంచి 6 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఖేడ్ పద్మశాలీ సంఘం బాధ్యులు సామలబషెట్టి, నర్సింహులు, రాఘవులు, శ్రీనివాస్ తదితరులు ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికను సోమవారం సీఐ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి అందజేశారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

కంది(సంగారెడ్డి): మండలంలోని కవలంపేట్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ 17వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, డాక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల నమోదు

ఏడీఏ నూతన్‌కుమార్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

కంగ్టి(నారాయణఖేడ్): రైతులు వేసిన పంటలను సంబంధిత ఏఈఓలతో క్షేత్రస్థాయిలోనే నమోదు చేయించుకోవాలని ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన పలు గ్రామాల్లోని పంటలు, నమోదు ప్రక్రియను పరిశీలించారు. ముర్కుంజాల్ శివారులో జొన్న చేనులో రైతులతో మాట్లాడారు. జొన్న పంటలకు పేనుబంక తీవ్రంగా ఉందని, నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములతో 2 మిల్లీలీటర్ల క్లోరోఫైరిఫాస్ గాని, ఫిప్రోనిల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరిలో పొటాష్‌లోపం ఎక్కువగా ఉందని యూరియా వాడకం తగ్గించాలని తెలిపారు. వరినాట్ల సమయంలో పొటాష్ ఎరువు వాడాలని చెప్పారు. పొటాష్ లోప నివారణకు 13-0-45 మందు 10 గ్రాములు గాని లేక అగ్రోమిన్ 2గ్రాములు లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలని వివరించారు. మొగిపురుగు నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్‌మందు 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ భార్గవ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



రామచంద్రాపురం(పటాన్ చెరు): రామచంద్రాపురం పట్టణం శ్రీనివాస్‌నగర్ కాలనీలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పోచమ్మ తల్లి బోనాల ఊరేగింపు, ఘట్టం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి రూ.వెయ్యి చొప్పున, ఐదుగురికి రూ.1500 చొప్పున, మరో వ్యక్తి కి రూ.2 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పది మందికి..

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ కథనం ప్రకారం.. ఆదివారం పోతిరెడ్డిపల్లి చౌరస్తా, పాత బస్టాండ్, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో పదిమందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ముగ్గురికి రూ. 2000, మిగతా ఆరుగురికి రూ.1500, చొప్పున, మరొకరికి రూ.1000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

'ఉపాధి హామీ' డబ్బుల రికవరీ

సామాజిక తనిఖీలో రూ. 4,77,713 అవకతవకల గుర్తింపు



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీఏ పీడీజ్యోతి (ఫైల్)

మునిపల్లి(అందోల్): ఉపాధిహామీ పథకంలో ఆయా గ్రామాల్లో రోడ్లు, మళ్లింపు కాల్వలు, ఫీడర్ చానల్, ఇంకుడు గుంతలు, పశువుల పాకలు వంటి పనులను కూలీలు నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో కూలీలు రూ.4.95 కోట్ల పనులను ఉపాధి హామీ పథకంలో కూలీలు నిర్వహించారు. దీంతో జిల్లా అధికారులు చేసిన పనులు, కూలీలకు చెల్లించిన డబ్బులపై ఆయా గ్రామాల్లో ఫిబ్రవరి 5 నుంచి 18 వరకు (సోషల్ అడిట్) సామాజిక తనిఖీ నిర్వహించారు. రూ.4,77,713 అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించారు. కొన్ని గ్రామాల్లో చేసిన పనులకు లెక్కలు సక్రమంగా ఉన్నాయని గుర్తించినట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే జాబ్‌కార్డు ఉన్నవారు పనులు చేసిన కూలీలందరికీ జిల్లా అధికారులు డబ్బులు చెల్లించమని స్పష్టమైన ఆదేశాలు రావడంతో డబ్బులు మంజూరు చేశారని ఏపీఓ యాదగిరి తెలిపారు. ఒక్కో ఇంట్లో జాబ్ కార్డులు కుటుంబ సభ్యులందరికీ ఉండడంతో డబ్బులు మంజూరు చేశామని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా ఉర్సు యే షరీఫ్ ఉత్సవాలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని పెద్దాపూర్ శివారులోని దర్గాలో 39వ ఉర్సు యే షరీఫ్ ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి, మత పెద్దలు, ముస్లింలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దీపారాధన చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రత్యేక తరగతుల తనిఖీ**



ప్రత్యేక తరగతులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంపీడీఓ సత్తయ్య పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను తనిఖీ చేశారు. పాఠశాల సమయం ముగిసిన అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు అందుబాటులో ఉంటున్నారా లేదా అనే విషయంపై ఆరా తీశారు. విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ ఇచ్చి తరగతులు నిర్వహించాల్సి ఉంది. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. తరగతుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

◆ **చెరువులు, కుంటలను కాపాడాలి**

కంది(సంగారెడ్డి): మండలంలోని ఎర్దనూర్ శివారులో చెరువులు, కుంటలు కబ్జా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ మల్లేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలోని క్రషర్ల వద్దకు వెళ్లేందుకు చెరువులు, కుంటల్లో మట్టిని నింపి దారులు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో కుంటల్లో చేపపిల్లలను పెంచుకునే వారికి జీవనోపాధి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చెరువులు, కుంటలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు పాల్గొన్నారు.

◆ **అందరివాడు అంబేద్కర్**

నారాయణఖేడ్: అంబేద్కర్ కొందరివాడు కాదని అందరివాడని ప్రవాస భారతీయుడు, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రుపు మశ్చందర్ అన్నారు. మండలంలోని రుద్రారంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆర్థికవేత్త, సంఘసంస్కర్త, కులమతాలకు అతీతంగా పోరాడిన మహనీయుడని కొనియాడారు. భీమ్ ఆర్మీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు తుకారాం, ఉమాసింగ్, సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

◆ **నూతన క్యాలెండర్ ఆవిష్కరణ**



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాల నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ పౌరులను తీర్చదిద్దడంతో విద్యాసంస్థలు ముఖ్యంగా అధ్యాపకుల పాత్ర గొప్పదన్నారు. నాణ్యమైన విద్యాబోధనతో మంచి ఫలితాలు వస్తాయన్నారు. చదువుతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు ఆచార్య కళాశాల యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ.శివలింగం, ప్రిన్సిపాల్ హరికుమార్, డైరెక్టర్లు పాల్గొన్నారు.


◆ **ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు**

పటాన్‌చెరు టౌన్: మండలంలోని గణేశ్ గడ్డ దేవస్థానంలో మహాశివరాత్రి పురస్కరించుకుని ఆలయ ఆవరణలోని శివాలయంలో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు అన్నదానం ఉంటుందని ఆలయ ఈఓ లావణ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఓ మాట్లాడుతూ.. శివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలతో పాటు సా. 6 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం ఉంటుందని, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాల స్వీకరించాలన్నారు.

◆ **డంపింగ్ యార్డు వద్దంటూ వినతి**

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా జేఏసీ చేస్తున్న పోరాటాలు సోమవారం 20వ రోజుకు చేరాయి. డంపింగ్ యార్డ్ ఏర్పాటును రద్దు చేయాలంటూ కమిషనర్‌కు గులాబీ పువ్వులు ఇస్తూ నిరసన వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో పరమేష్ ను కలిసి మెమోరాండం అందజేశారు. పర్యావరణం, ప్రజల జీవన విధానంపై దెబ్బతీసే డంపింగ్ యార్డు ఏర్పాటు ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. అదే విధంగా జీహెచ్‌ఎంసీ డీపీఆర్ రిపోర్టును ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల పోరాటానికి సీపీఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని జిల్లా కార్యదర్శి అతిమల మాణిక్ అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలి



లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేస్తున్న రైతులు

పుల్‌కల్(అందోల్): వరిపంట రక్షణకు ఎకరాకు 4-5 లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేయాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత సంగుపేట రాహుల్ విశ్వకర్మ రైతులకు సూచించారు. సోమవారం ఇసోజీపేట గ్రామంలో ఏరువాక కేంద్రం వరిపంటలో క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వరిలో ప్రధానంగా చీడపీడలు, తెగుళ్ల, యజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. వరిలో అక్కడక్కడ కాండం తొలుచు పురుగు గాయాలు ఉన్నాయని రైతులకు తెలిపారు. దాని నివారణకు ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోల ఇసుకలో కలిపి చల్లాలన్నారు. లింగాకర్ష బుట్టలను ఏర్పాటుతో అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, తైర వెంకటేశం, రాములు పాల్గొన్నారు.